
# రాయా కిసెల్నికోవ



# ఏజెంట్ X

## యెదుళ్ల సురేష్ రెడ్డి

మెక్సికో... 1970 ఫిబ్రవరి 7...

తన అపార్ట్‌మెంట్‌లోని పడకగదిలో ముసుగు తన్ని పడుకున్న కె.జి.బి. అధికారి పాల్‌లోవిచ్ కొలొమ్‌యాకోవ్ ప్రక్కనే ఉన్న టెలిఫోన్ మ్రోగడంతో నిద్రలోంచి మేల్కొన్నాడు. దాదాపు 55 సంవత్సరాల వయసుంటుందతనికి. కె.జి.బి. లో ముఖ్యమైన ఏజెంట్లలో అతనొకడు.

రష్యా, అమెరికాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం జరుగుతున్న సమయంలో అమెరికా కూటమిలో ఉన్న మెక్సికోలో సివిల్‌వార్‌ని సృష్టించి, సాయుధ దళాల సహాయంతో అక్కడి ప్రభుత్వాన్ని కూలదోసి మెక్సికోను పతనం చేయాలని రష్యా అధికారులు పథకం వేశారు. అందులో భాగంగా ఎంతోమంది కె.జి.బి. ఏజెంట్లను అధికారుల రూపంలో మెక్సికో లోని రష్యా రాయబార కార్యాలయానికి పంపించారు. ఆ ఎంబసీ ద్వారా కె.జి.బి. ఏజంట్లు చాలా పెద్ద ఎత్తున గూఢచర్య కార్యకలాపాలకు పాల్పడ్డారు. అందులో భాగంగానే లాటిన్ అమెరికా దేశాల్లో గూఢచారిగా ఎన్నో విజయవంతమైన కార్యకలాపాల్లో పాల్గొన్న కొలొమ్ యాకోవ్‌ని కె.జి.బి. మెక్సికోకు పంపించింది.

నిద్రమత్తులో పెద్దగా ఆవలిస్తూ రిసీవర్ని అందుకున్నాడు యాకోవ్. అవతలి వైపు నుండి సోవియట్ కమర్షియల్ ఆఫీస్ అధికారి కంఠం ఆత్రుతగా విన్పించింది "రాయా కిసెల్నికోవ కన్పించడంలేదు యాకోవ్."

యాకోవ్ నిద్రమత్తు ఒక్కసారిగా దిగి పోయింది. 'వ్వాట్..!" అంటూ అరిచాడు కీచుగా

"అవును యాకోవ్.. రాయా కన్పించడంలేదు. బహుశా ఆమె పారిపోయిందేమో అని మా అనుమానం"

యాకోవ్ ఆదుర్దాగా నుదురు రుద్దుకున్నాడు. ఉదయాన్నే అంత చెడ్డ వార్తను అతను జీర్ణించుకోలేకపోతున్నాడు. "ఆమె అపార్ట్‌మెంట్‌లో చూశారా..?" అంటూ అడిగాడు లాభం లేదని తెలిసికూడా.

"చూశాము. అక్కడా లేదు, ఎంబసీలో కూడా లేదు."

చిన్నగా తలపంకిస్తూ ఫోను పెట్టేశాడు యాకోవ్. మరో పది నిమిషాల్లో ఆదరాబాదరాగా నెచిపొరెంకో ముందు ప్రత్యక్ష్యమయ్యాడతను.

"ఏం జరిగింది..? " అతనంత కంగారుగా

రావడంతో అర్థంకానట్టుగా అడిగాడు నెచిపోరెంకో. కె.జి.బి.లోని అతి ప్రమాదకరమైన టాప్ రాంక్ ఆఫీసర్లతో అతనొకడు. మెక్సికోలో టెర్రరిజాన్ని ఎగదోసి మెక్సికో ప్రభుత్వాన్ని పడగొట్టే బాధ్యతను కె.జి.బి అతనికి అప్పగించింది. మెక్సికో పతనానికి కె.జి.బి నిర్వహిస్తున్న ప్రతి కార్యక్రమం అతని చేతుల మీదుగానే అమలు జరుగుతుంది.

రాయా పారిపోయిందన్న విషయాన్ని యాకోవ్ నోటి నుండి విన్న నెచిపోరెంకో ఆందోళనతో వణికిపోయాడు. రాయా పారిపోవడమన్నది ఎంతటి ప్రమాదాన్ని కొని తెస్తుందో •వారిద్దరికీ తెలుసు. మెక్సికో పతనానికి కె.జి.బి నిర్వహిస్తున్న గూఢచర్యానికి సంబంధించిన ఎన్నో విషయాలు ఆమెకు తెలుసు. కె.జి.బి. మెక్సికో విద్యార్థుల్ని రెచ్చగొట్టి వారి ద్వారా కల్లోలాల్ని రేపడం, పత్రికాధిపతుల్ని లొంగదీసుకుని వారిద్వారా పత్రికల్లో రష్యా అనుకూల వార్తలు ప్రచురించడం, మెక్సికో గెరిల్లా దళాల రహస్యాలు, కె.జి.బి. పన్నాగాలు లాంటి ఎన్నో విషయాలు ఆమెకు తెలుసు. కె.జి.బి. ఏజంట్లకు, మెక్సికో తిరుగుబాటు గెరిల్లా దళాలకు మధ్యన జరిగిన చర్చలకు ఆమె ప్రత్యక్ష సాక్షి. అలాంటి ఆమె మెక్సికో ప్రభుత్వానికి ఈ విషయాలన్నీ చెప్పిందంటే అప్పటివరకూ కె.జి.బి. చేసిన ప్రయత్నాలన్నీ బూడిదలో పోసిన పన్నీరవుతాయి.

నెచిపోరెంకో వెంటనే తన ఏజంట్లందరికీ రెడ్ ఎలర్ట్ ప్రకటించాడు. రాయా కోసం పెద్ద ఎత్తున వేట ప్రారంభమైంది. కె.జి.బి. కార్యక్రమాలన్నీ ఎక్కడివక్కడ ఆగిపోయాయి. మెక్సికోలోని ప్రతి రష్యా అధికారి రాయా కోసం వెదకడం మొదలు పెట్టారు. కె.జి.బి. తొత్తుగా పనిచేసే మెక్సికో మాజీ పోలీసు అధికారి కె.జి.బి.కి మద్దతుగా తన బలగాలన్నింటినీ రంగంలోకి దించాడు. మెక్సికోలోని ప్రతి ముఖ్యమైన ప్రాంతంలోనూ రాయాకోసం వేట కొనసాగింది. ఆమె ఎక్కడ కనబడితే అక్కడ కాల్చివేయాల్సిందిగా ఆదేశాలు జారీ అయ్యాయి. అయినా ఫలితం లేకపోయింది. అంతమంది డిటెక్టివ్‌లు రాత్రింబవళ్ళు పనిచేసినా రాయా జాడమాత్రం తెలియలేదు.

రేడియేషన్ ప్రభావంవల్ల చనిపోయిన ఒక రష్యా సైంటిస్టు భార్య రాయా. దాదాపు ముప్పై సంవత్సరాల వయసుంటుందామెకు. మంచి అందగత్తె. నీలికళ్ళ సుందరి అని పిలుస్తుంటారామెను. మొదటి నుండీ స్వేచ్ఛగా ఉండడమన్నా, స్వేచ్ఛగా బ్రతకడమన్నా ఆమెకు చాలా ఇష్టం. రష్యా కమ్యూనిస్టు ప్రభుత్వంలో ప్రజలు స్వేచ్ఛగా బ్రతకలేకపోవడం ఆమెను నిరంతరం బాధించేది. తూర్పు జర్మనీలో చదివిన ఆమె అక్కడి పాశ్చాత్య జీవన విధానానికి మరింత ఆకర్షితురాలైంది. తనూ అలా బ్రతకాలని ఆశపడేది. రష్యా ప్రజల జీవన విధానం ఆమెకు ఏమాత్రం నచ్చేది కాదు.

రష్యాలో శాస్త్రవేత్త అయిన ఆమె భర్త రేడియేషన్ ప్రభావం వల్ల మరణించినప్పుడు రష్యా ప్రభుత్వం ఆమెను మెక్సికోలోని రష్యా ఎంబసీలో సెక్రటరీగా నియమించింది. ఉద్యోగంలో చేరేముందు మెక్సికన్లతో ఎక్కువగా పరిచయాలు పెంచుకోవద్దనీ, వారితో రష్యా విధానాల గురించి చర్చించవద్దని రష్యా ప్రభుత్వం పెట్టిన షరతులకు ఆమె అంగీకరించింది. ఆమెను పూర్తిగా నమ్మిన మెక్సికోలోని కె.జి.బి. అధికారులు ఆమెకు కావాల్సినంత స్వేచ్ఛను కల్పించారు. అక్కడ ఆమె తరచూ ఆంత్రోపాలజికల్ మ్యూజియంకు వెళ్ళడం, డిస్కోలకు వెళ్ళి డ్యాన్సులు చేయడం మొదలు పెట్టింది. వాటికి తోడు మెక్సికన్లతో పరిచయాల్ని పెంచుకుని వారితో రష్యా అంతర్గత రాజకీయాలను గురించి, ప్రజా విధానాల గురించి చర్చించేది. మెక్సికన్ల స్వేచ్ఛా జీవనానికి ఆమె విపరీతంగా అసూయపడేది. తనూ అలా బ్రతకాలని ఆశపడేది.


మంచి అందగత్తె అయిన ఆమెను ఎంబసీలోని కె.జి.బి. అధికారులందరూ అభిమానించేవాళ్ళు. నవ్వుతూ, నవ్విస్తూ సరదాగా ఉండే ఆమెను ఆకట్టుకోవడం కోసం ప్రతిఒక్కరూ ప్రయత్నించేవాళ్ళు. కె.జి.బి. ఏజెంట్లకు, మెక్సికో గెరిల్లా దళాలకు మధ్య జరిగే సమావేశాలకు కె.జి.బి. అధికారులతో పాటు ఆమెకూడా హాజరయ్యేది. కొంతమంది కె.జి.బి. అధికారులు ఆమె అభిమానాన్ని సంపాదించుకోవడం కోసం తమ గూఢచర్య కార్యకలాపాలకు సంబంధించిన వివరాలన్నింటినీ ఆమెతో చెప్పేవారు. యాకోవ్ కూడా ఆమెతో ఎన్నో రహస్య విషయాల గురించి మాట్లాడేవాడు. అందరికన్నా ఎక్కువగా ఆమెను నమ్మి, అభిమానించిన వాడు నెచిపోరెంకో. ఇద్దరూ త్వరలోనే మంచి స్నేహితులయ్యారు. నెచిపోరెంకో కూడా స్వేచ్ఛాజీవి కావడంతో వారి సాన్నిహిత్యం మరింతగా బలపడింది. ఆమెను మనస్ఫూర్తిగా ప్రేమించి ఆరాధించిన నెచిపోరెంకో ఆమెకు కావాల్సినంత స్వేచ్ఛను కల్పించి ఆమెతో ఎన్నో రహస్యమైన విషయాల గురించి చర్చించేవాడు.

అయితే రష్యా జాతీయురాలిగా తను ఎప్పటికీ స్వేచ్ఛగా బ్రతకలేనని భావించిన రాయా ఎంబసీ నుండి పారిపోయి మెక్సికో ప్రభుత్వపు ఆశ్రయాన్ని కోరింది. కె.జి.బి. గురించిన అన్ని రహస్యాలు తెలిసిన రాయా పారిపోవడంతో నెచిపోరెంకో కలవరపడ్డాడు. ఈలోగా మెక్సికో ప్రభుత్వం రాయాకు రాజకీయ ఆశ్రయం కల్పిస్తున్నట్టుగా ప్రకటించింది. కె.జి.బి. అధికారులకు ఇది ఊహించని పరిణామం. రాయాతో ఒకసారి మాట్లాడడానికి అనుమతి ఇవ్వాల్సిందిగా రష్యా అధికారులు మెక్సికో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెక్సికో ప్రభుత్వం పెద్దగా అభ్యంతరం చెప్పకుండానే అందుకు అంగీకరించింది.

పటిష్ఠమైన సెక్యూరిటీ రక్షణలో ఉన్న రాయాను కలుసుకున్న నెచిపోరెంకో ఆమెను తిరిగి రావాల్సిందిగా అభ్యర్థించాడు. ఆమెకు ఎలాంటి అపకారం తలపెట్టబోమనీ, క్షమించి వదిలేస్తామనీ మనస్ఫూర్తిగా హామీ ఇచ్చాడు. అతని మాటలకు ఆమె పెద్దగా ఏడవడం ప్రారంభించింది. తను తిరిగి రాలేననీ, తనకు స్వేచ్ఛ కావాలనీ ఏడుస్తూ చెప్పింది. తనకు తెలిసిన రహస్యాలేవీ మెక్సికో ప్రభుత్వానికి చెప్పనని మాత్రం హామీ ఇచ్చింది. స్వేచ్ఛా జీవితంకోసం ఆమె తపనను గమనించిన నెచిపోరెంకో మరేమి మాట్లాడకుండా ఆమెను ప్రేమగా ముద్దు పెట్టుకుని తడిబారిన కళ్ళతో అవతలికి వెళ్ళిపోయాడు.

స్వేచ్ఛ కోసం, తన ఇష్టానిష్టాలకు అనుగుణంగా బ్రతకడం కోసం పరాయి దేశపు ఆశ్రయం పొందిన ఆమె తను మాట ఇచ్చినట్టుగానే కె.జి.బి.కి సంబంధించిన రహస్యాలేవీ మెక్సికో ప్రభుత్వానికి వెల్లడించలేదు.

●



**నడవగలను**

సబ్బారావు వరంగల్ ఆర్.టి.సి. బస్టాండ్ దగ్గర నుంచునున్నాడు.

అతని దగ్గరకో వ్యక్తి వచ్చి 'మీరు పాకాలా?' అని అడిగాడు.

'లేదు నడువగలను' సీరియస్‌గా చెప్పాడు సుబ్బారావు.

ఎ. హరికుమార్ (వేంసూరు)